## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీవ్రతం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో గల భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో శనివారం అష్టలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస రమేష్ ఆచార్యుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేక ఊంజల్ సేవ చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజమన్నే, పలువురు భక్తులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి విరాళం



లక్ష రూపాయల విరాళం అందజేస్తున్న జగన్నాథరావు, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు ఆలయంలో నిత్యాన్నదానానికి విశాఖ జిల్లా దొండపర్తికి చెందిన జగన్నాథరావు, సూర్యారావు, అప్పలనరసయ్య, పరమేశ్వరరావు, ఈశ్వరమ్మ లక్ష రూపాయల విరాళాన్ని శనివారం అందజేశారు. వారి తల్లిదండ్రులు సూర్యప్రకాశరావు, శాంతామణిల జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి. సత్యం అన్నారు. శనివారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్సపై అవగాహన ఏర్పరచుకోవడం వల్ల ఏదైనా విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులకు సాయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, గౌరీశంకర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

### సింగం చెరువులో ఆక్రమణలు



చెరువు గట్టు చదును చేసిన దృశ్యం

భోగాపురం: మండల కేంద్రంలోని సింగం చెరువు ఆక్రమణనకు గురవుతోంది. రాత్రికి రాత్రే చెరువు గట్టును ఆక్రమించేందుకు కొంతమంది వ్యక్తులు సిద్ధపడ్డారు. సుమారు నాలుగైదు సెంట్ల వరకు చెరువులోకి మట్టిని తరలించి చదును చేశారు. ఈ చెరువు కింద సుమారు 20 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆక్రమణలతో చెరువు కుచించుకుపోతే తమ భూములకు నీరు ఎలా అందించేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ చింతాడ బంగార్రాజు వివరణ కోరగా.. చెరువును పరిశీలించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటానన్నారు.

### బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావును అభినందిస్తున్న బవిరెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నడుకుదిటి ఈశ్వరరావును ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాణంగిపల్లి అశోక్, ఇప్పిలి గోపాలకృష్ణ, జగ్గారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### సిమ్స్ చర్చి వార్షికోత్సవం ప్రారంభం

విజయనగరం టౌన్: పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ వద్దనున్న అతి పురాతనమైన సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 148వ వార్షికోత్సవం సంఘమిత్ర ఆర్‌ఎస్ జాన్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా పాస్టర్ రెవరెండ్ డాక్టర్ వై.ప్రభుకర్ నేతృత్వంలో శనివారం యూత్ రీట్రీట్ నిర్వహించారు. కార్యక్రమంలో రెవరెండ్ జాన్ విక్టర్ , రాస్ కుమార్ , ఎబినైజర్, సుకుమార్, ఆనందరావు, యూత్ రీట్రీట్ కన్వీనర్ ఆకాజాన్, డేని, జీవన్, జాన్, చెరిల్స్, రేచల్, పెర్సల్, పాల్గొన్నారు.

# కార్పొరేట్ సచివాలయం...



కొండవెలగాడ గ్రామ సచివాలయం

- కొండవెలగాడలో అత్యాధునిక హంగులతో భవనం
- పచ్చదనానికి ప్రాధాన్యం
- అన్ని విభాగాలకూ ప్రత్యేక కౌంటర్లు



విధుల్లో సచివాలయ సిబ్బంది



సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలు



వివిధ రకాల మొక్కలతో పచ్చగా దర్శనమిస్తున్న సచివాలయం ప్రాంగణం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామ సచివాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రత్యేక చొరవతో, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 లక్షల నిధులతో పాటు స్థానిక వనరులను సమకూర్చి మిగతా సచివాలయాల కంటే భిన్నంగా వెలగాడ సచివాలయాన్ని సిద్ధం చేశారు. సచివాలయ పరిసరాలు పచ్చదనంతో దర్శనమిస్తున్నాయి. విలువైన పూల మొక్కలు ఏర్పాటు చేయడంతో పాటు, అందంగా కనిపించేందుకు వివిధ రకాల మొక్కలను నాటారు. సచివాలయం ముందు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. లోపల వివిధ విభాగాలకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, ఆయా విభాగాలకు నేమ్ బోర్డులు కూడా అమర్చారు. వెయిటింగ్ రూమ్, మీటింగ్ హాల్‌లో విలువైన ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. సేవలు నిమిత్తం సచివాలయానికి వెళుతున్న ప్రజలకు కార్పొరేట్ కార్యాలయానికి వెళుతున్నామనే భావన కలుగుతుండడం విశేషం.

**సంక్షేమం, అభివృద్ధి ఇలా..**

గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు 2019–20లో మొత్తం రూ.4.06 కోట్లు ఖర్చు చేశారు. 2020–21లో రూ.5.73 కోట్లు, 2021–22లో 6.53 కోట్లు, 2022–23 (ఇప్పటివరకు) రూ.6.14 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. వీటితో పాటు ఇళ్లు లేని 62 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలను సైతం అందజేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామ సచివాలయం ద్వారా లబ్ధి చేకూరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.




సచివాలయంలో నేమ్ బోర్డులతో ప్రత్యేక డెస్కులు

# తగ్గిన కూరగాయల ధరలు

- కిలో టమాట రూ.20.. అల్లం రూ.120
- ఊపిరి పీల్చుకుంటున్న వినియోగదారులు



కూరగాయలు విక్రయిస్తున్న వినియోగదారుడు

భోగాపురం: వారం రోజుల కిందటి వరకు కొండెక్కి కూర్చున్న కూరగాయాల ధరలు దిగివస్తున్నాయి. కొద్ది రోజుల కిందటి వరకు అధిక ధర పలికిన టమాటా ప్రస్తుతం నేలచూపులు చూస్తోంది. రూ.220 నుంచి 20 రూపాయలకు దిగి రావడంతో కొనేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. అలాగే ఆకాశంలో ఉన్న అల్లం ధర ప్రస్తుతం కిందకొచ్చింది. గతంలో రూ.200 ఉన్న అల్లం ధర నేడు రూ.120కు చేరుకుంది. క్యాప్సికమ్, పచ్చిమిర్చి మాత్రం కిలో రూ.60 ఉండగా బంగాళదుంప, కాళీఫ్లవర్, ముల్లంగి, బీట్‌రూట్ కిలో 40 రూపాయలు పలుకుతున్నాయి. క్యారెట్, వంకాయలు కిలో రూ.35 ఉండగా.. చిక్కుడుకాయలు, క్యాబేజీ, దోసకాయలు కిలో రూ.30.. దొండకాయులు, బెండకాయలు 20 రూపాయలకు విక్రయిస్తున్నారు.

### వేధింపులు ఆపాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ఆటోడ్రైవర్లపై పోలీసుల వేధింపులు ఆపాలని, అక్రమంగా బనాయించిన కేసులు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి ఈ నెల 11న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యనారాయణ, టీవీ రమణ, జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్‌మోహన్, బి. రమణ, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# అక్షర జ్ఞానం అందించే అపరబ్రహ్మ గురువు



ఉత్తమ ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం: అక్షర జ్ఞానమందించే అపర బ్రహ్మ గురువు అని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఉపద్రష్ట వరప్రసాద్, సుపథ రూపకర్త యూవీఏఏ రాజు అన్నారు. తెలుగుభాషా పరిరక్షణ సమితి, కుసుమంచి ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం నిర్వహించిన గురుపూజా దినోత్సవంలో వారు మాట్లాడుతూ, గురుదేవులు జ్ఞానమనే దివ్వెను వెలిగించి.. ఆ వెలుగులో మన వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తారని తెలిపారు. సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ.. గురువు జ్ఞానమై శిష్యుల్లోకి ప్రవహిస్తూనే ఉంటాడన్నారు. కార్యక్రమాన్ని కంచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. అనంతరం ఉత్తరాంధ్ర నుంచి 52 మంది ప్రధాన ఉపాధ్యాయులకు, ఆరుగులు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఫౌండేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, సమితి అధ్యక్ష, కార్యదర్శులు గురుప్రసాద్, జక్కు రామకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగు భాష పరిరక్షణ, భాషా వైభవంపై పలువురు వక్తలు ప్రసంగించారు.

# తపాలా సేవలు వినియోగించుకోండి..



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా శాఖ సిబ్బంది

- పోస్టల్ సూపరింటిండెంట్ సుందరనాయుడు

భోగాపురం: తపాలా శాఖ అందిస్తున్న సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఆ శాఖ సూపరింటిండెంట్ పి. సుందరనాయుడు కోరారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'ఆధునిక సాంకేతిక సేవల దిశగా అడుగులు వేస్తున్న తపాలా శాఖ – జనంలోకి మనం' అనే అంశంపై ప్రత్యేక మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ అందిస్తున్న ఎస్‌బీ, ఆర్‌డీ, ఎస్‌ఎస్‌ఏ, ఎంఎస్‌ఎస్‌సీ, పీఎల్‌ఐ, ఆర్‌పీఎల్‌ఐ, ఐపీపీబీ వంటి పథకాలపై అవగాహన కల్పించారు. బాలికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సుకన్య సమృద్ధి యోజన పథకం బాగా ప్రాచుర్యం పొందిందని, అలాగే మహిళల కోసం మహిళా సమ్మాన్ సేవింగ్ పథకం వల్ల కూడా మంచి లబ్ధి చేకూరుందని సూపరింటిండెంట్ సుందరనాయుడు తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భోగాపురం బ్రాంచ్ పోస్టుమాస్టర్ పప్పల శ్రీనివాసరావు, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ రవికుమార్, ఐపీపీబీ మేనేజర్ సతీష్, డీఓపీఎల్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### రోటరీ ఖోఖో పోటీలకు స్పందన



ఖోఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన మాసోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన పాఠశాల విద్యార్థుల ఖోఖో పోటీలకు అనూహ్య స్పందన లభించింది. నగరంలోని అయోధ్య మైదానంలో నిర్వహించిన పోటీలకు 40 జట్లు హాజరయ్యాయి. పోటీలను యువజన మాసోత్సవాల చైర్మన్ శంకర్‌రెడ్డి, డైరెక్టర్ బలభద్రుని అశోక్, క్లబ్ అధ్యక్షుడు ఉడత్తు రాజేష్, కార్యదర్శి అరుణ్ ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి అవసరమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు యువజన మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అశోక్, అరిశెట్టి నగేష్, మంచుకొండ అశోక్, కొల్లా మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# 12,13న మండల స్థాయి స్కూల్ గేమ్స్



మాట్లాడుతున్న ఎంఈఓ పాపినాయుడు

పూసపాటిరేగ: ఈ నెల 12,13వ తేదీలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి బి. పాపినాయుడు తెలిపారు. శనివారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలో ఉన్న పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంలోని ఎస్‌వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో అండర్–14, అండర్–17 కేటగిరీలలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అండర్–14 కేటగిరీ క్రీడలలో పాల్గొనదలచిన విద్యార్థులు 1.1.2010.. అండర్–17 కేటగిరీ క్రీడలలో పాల్గొనదలచిన విద్యార్థులు 1.1.2007లోపు జన్మించి ఉండాలన్నారు. ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటిన్, బాల్‌బ్యాడ్మింటిన్, యోగా వంటి క్రీడాంశాలు ఉంటాయన్నారు. సమావేశంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కృష్ణతత్వాన్ని అలవర్చుకోవాలి..



అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొన్న యాదవ సంఘ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: కృష్ణతత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని యాదవ సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ మధుయాదవ్ అన్నారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సంఘ అధ్యక్షుడు మాన్యాల కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక కాటవీధి ఎస్సీ హాస్టల్‌లో శనివారం అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ, మానవ సేవే మాధవ సేవని, ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలని సూచించారు. కార్యక్రమంలో యా దవ సంక్షేమ సంఘ జిల్లా మహిళా అధ్యక్షురాలు గదుల సత్యలత యాదవ్, యాదవ యువజన నాయకులు మన్యాల శ్రీనివాస్ యాదవ్, నమ్మి గోపి యాదవ్, వడ్డే రవికుమార్ యాదవ్, పడగల బంగార్రాజు యాదవ్, బమ్మిడి ఎల్లారావు యాదవ్, ముచ్చు శేఖర్ యాదవ్ బూడి పైడ్రాజు యాదవ్, గాజులరేగ యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరస్వామికి పూలంగిసేవ



జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వస్వామి ఆలయంలో స్వామివారికి ఆలయప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం పూలంగిసేవ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

# సమస్యలు పరిష్కరించాలి



మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: మధ్యాహ్న భోజన పథక కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కూన స్రవంతి కోరారు. ఈ మేరకు మంత్రి బొత్స సత్యనారాయణను అతని స్వగృహంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం పదివేల రూపాయలు ఇవ్వాలన్నారు. నాలుగు నెలల నుంచి విద్యార్థులకు అందిస్తున్న రాగి మాల్ట్‌కు సంబంధించి ఇవ్వాల్సిన బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, సెప్టెంబర్ నెల లోపే కొత్త వంట పాత్రలు ఇచ్చే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అదేవిధంగా పెండింగ్ బిల్లులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. గౌరవవేతనాలు, మెస్ బిల్లులు పెంచేలా చర్యలు చేపడతామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాజి, పి. లక్ష్మి, ధనమ్మ, చిన్నారి, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

# రామతీర్థంలో ప్రత్యేక పూజలు



యాగశాలలో హోమం జరిపిస్తున్న అర్చకులు



స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో సుందరకాండ హవనం, సుదర్శన అష్టకం, తదితర హోమాలు జరిపించారు. అనంతరం ఆస్థాన వెండి మండపంలో సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.